క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సబ్‌స్టేషన్ పరిధిలోని సిద్ధార్థ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం గ్రామంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. దీని కారణంగా గ్రామంలో పోరంకి సెంటర్, ప్రభునగర్, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని స్థానికులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని కాల్వగట్టు ప్రాంతాలు పటేల్ నగర్, సాయినగర్, హనుమాన్‌నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లైఓవర్ దిగువ ప్రాంతం, బల్లెంవారి వీధి, రైల్వేస్టేషన్ కట్ట ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయంలో చీరల బహిరంగ వేలం

పెనమలూరు: యనమలకుదురు లాకుల వద్ద శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి యూవీ.ప్రసాదరావు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ.. భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలకు ఈ నెల 8, 9వ తేదీలలో ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. అధికారుల సమక్షంలో నిర్వహించే ఈ వేలంలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలన్నారు.

హ్యాకదాన్ పోస్టర్ విడుదల



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో శుక్రవారం ఏఐ డివైజెస్ హ్యాకదాన్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతన అవిష్కరణలు, సృజనాత్మకతను పెంపొందించటానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఫిబ్రవరి 6వ తేదీన కాలేజీలో ఏఐ డివైజెస్ హ్యాకదాన్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ హ్యాక్‌దాన్‌ను ప్రాంభిస్తారని తెలిపారు. ఏఐ డివైజెస్ హ్యాకదాన్ పోటీలో దేశ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.5 లక్షల నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ డీన్ డి.రాజేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు వంతెన డౌన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు గ్రామానికి చెందిన ఐనంపూడి వెంకటేష్ బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అతను బైక్‌పై ఇంటికి వస్తున్న సమయంలో ఎదురుగా ఒకే బైక్ పై ముగ్గురు వ్యక్తులు అతివేగంగా వచ్చి వెంటేష్ బైక్‌ను ఢీ కొట్టారు. ఈ ఘటనలో వెంకటేష్‌కు గాయాలు అవ్వటంతో పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితుడి తల్లి జయశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పండుగ పేరుతో జూదాలకు పాల్పడితే చర్యలు



ఉయ్యూరు: సంక్రాంతి పండుగ పేరుతో జూద క్రీడలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్‌కార్యాలయలలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కోడిపందేలు, జూదం, అసాంఘిక కార్యకలాపాలపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష చేశారు. సమావేశంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఎంపిడిఓ జిఎస్‌వి శేషగిరిరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల పని వేళలు కుదించాలి

గన్నవరం రూరల్: గ్రంథాలయాల పని వేళలను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు కుదించాలని జిల్లా గ్రంథాలయాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.కృపానందం విజ్ఞప్తి చేశారు. ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సంప్రదించి సరైన నిర్ణయం తీసుకునే విధంగా కోరతానని వారికి తెలియజేశారు. గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి చిన రాజు పాల్గొన్నారు.

అనుమతులెందుకు.. అధికారం మనదే!

- అనుమతులు లేకుండా ప్లాట్‌ఫాం నిర్మాణం
- నిబంధనలు తుంగలో తొక్కిన వైనం
- చూసీచూడనట్టుగా అధికారులు

నున్న(విజయవాడరూరల్): తీర్మానాలు లేవు..అంచనాల ఊసే లేదు..అనుమతులు అసలే లేవు. అయినా ప్లాట్‌ఫాం నిర్మాణం జరుగుతోంది. నున్న గ్రామంలో పరిస్థితి ఇది. అధికార పార్టీకి చెందిన నాయకులు అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా లక్షలాది రూపాయల విలువ చేసే పనులు చేస్తున్నారు.

విషయం ఇదీ..

నున్న గ్రామం కోటకట్ట సెంటర్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డుకు అనుసంధానంగా ప్రభుత్వ స్థలంలో అధికార పార్టీకి చెందిన నాయకులు ప్లాటుఫామ్ నిర్మిస్తున్నారు. నూజివీడు ఆర్అండ్‌బీ రోడ్డుకు ఆనుకొని తూర్పు భాగాన ఉన్న ఖాళీ స్థలంలో ప్లాటుఫామ్ నిర్మాణం పనులు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలన్నా ముందుగా పంచాయతీ పాలకవర్గ సమావేశంలో చర్చించి తీర్మానం చేయాల్సి ఉంది. అనంతరం ఆ పనికి సంబంధించి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు రూపొందించుకోవాలి. ఆ తర్వాత సాంకేతిక పరమైన అనుమతులు తీసుకొని, పరిపాలనా పరమైన అనుమతులు పొందిన తర్వాత పనులు చేయడం ప్రారంభిస్తారు. ఇక్కడ జరుగుతున్న పనిని ఇంజినీరింగ్ అసిస్టెంట్ పర్యవేక్షిస్తున్నారు. దీంతో ఇది పంచాయతీ నిధులతో నిర్వహిస్తున్న పనేనని తెలుస్తోంది.



నున్న కోటకట్ట సెంటర్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ప్లాట్‌ఫామ్

చేస్తోంది ఇలా..

విధానాలను విస్మరించి అధికార పార్టీ నాయకులు చేసే పనులకు కూడా నిబంధనలు పాటించాలా అనే ధీమాతో కోటకట్ట సెంటర్లో ప్లాటుఫామ్ పనులు యమ స్పీడుగా చే సేస్తున్నారు. చాటుగా మాటుగా ఉన్న ప్రాంతం కాదది. బహిరంగంగా ఈ పనులు జరుగుతున్నా అధికారులు మాత్రం కళ్లప్పగించి చూస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.5 లక్షలకుపై బడి జరిగే అభివృద్ధి పనులకు టెండర్ పిలవాలి. టెండర్ వచ్చిన కాంట్రాక్టర్‌తో ఆ పనులు జరిపించాల్సి ఉంటుంది. అలాంటి నిబంధనలు ఏమీ పాటించకుండా అధికార పార్టీకి చెందిన వారు తమకు ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ధోరణిలో పనులు చేస్తున్నారు.

అధికారుల తీరు ఇదీ..

ప్రశ్నించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఈ విషయాన్ని గురువారం జరిగిన గ్రామ సభలో ప్రశ్నించకపోవడం శోచనీయమని గ్రామస్తులు అంటున్నారు.

నాకేం తెలియదు..

ప్లాటుఫామ్ నిర్మాణం విషయాన్ని పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనివాసరావు దృష్టికి తీసుకె ళ్లగా నేను కొత్తగా వచ్చానని, తనకు ఆ నిర్మాణ పనుల గురించి తెలియదన్నారు.

అంచనాలు లేవు..

పంచాయతీరాజ్ అసిస్టెంటు ఇంజినీరు శివరామ్ ప్రసాద్ వద్ద ఈ పని విషయాన్ని ప్రస్తావించగా పంచాయతీ తీర్మానం లేకుండా పంచాయతీ నిధులతో ఎలాంటి పనులు చేపట్టరాదన్నారు. ఆ పనికి ఇంజినీరింగ్ శాఖ నుంచి అంచనాలు లేవన్నారు.

మూగ జీవాలకు ప్రేమను పంచుతూ..

వీధి కుక్కలను అక్కున చేర్చుకున్న చిరు వ్యాపారి

కంకిపాడు: 'పప్పీ...కామ్‌గా ఉండూ.. కొక్కొరి, పద్మ, లారెన్స్ ఎక్కడున్నారు మీరంతా..?, చింటూ అల్లరి చేయకు.. పిల్లలను ఎంతో ఆప్యాయంగా పలకరిస్తున్నట్టు ఉంది కదూ..!. అవును ఆ చిరు వ్యాపారి కుటుంబం ఎంతో ఆప్యాయంగా సాకే వీధి కుక్కల పేర్లు ఇవి. వీధి కుక్కలను కంటికి రెప్పలా చూసుకుంటున్నారు చిరు వ్యాపారి మార్వ గిరి దంపతులు. గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన మార్వ గిరి, విజయ దంపతులు 15 ఏళ్ల క్రితం కంకిపాడుకు వచ్చారు. పట్టణంలోని ఓ ఇల్లు అద్దెకు తీసుకుని బైపాస్ రోడ్డు పక్కన కళ్లజోళ్లు, టోపీలు అమ్మే చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు.

తొమ్మిదేళ్లుగా వాటితో మమేకమై..

తొమ్మిదేళ్లక్రితం వీరు నిర్వహించే దుకాణం వద్దకు ఓ ఆడకుక్క వచ్చింది. అప్పటికే అది గర్భంతో ఉండి, దుకాణం వద్దే పిల్లలను పెట్టింది. దుకాణం తెరిచేందుకు వచ్చిన గిరి, విజయ దంపతులు కుక్క, దాని పిల్లలను చూసి కళ్లు తెరవని కూనలకు పాలు పట్టి వాటిని చంటిబిడ్డల్లా సాకి మానవత్వం ప్రదర్శించారు. అప్పటి నుంచి అవి అక్కడే ఆవాసం చేసుకుని జీవిస్తున్నాయి. ఇవి కుర్చీలు, మంచం, సామగ్రి తీసుకొచ్చే పరదాలపై సేదతీరుతూ దర్పాన్ని ప్రదర్శిస్తాయి.

కష్టం అనిపించినా.. ఇష్టంగా..

రోజంతా దుకాణంలో భార్యాభర్తలు ఉండి కళ్లజోళ్లు, టోపీలు, సీటు కవర్లు అమ్మితే రూ.600 నుంచి రూ.700 వస్తాయి. ఆ సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకుంటూ, కుక్కల బాగోగులు కూడా గిరి దంపతులు చూసుకుంటారు. కుక్కల పోషణకు రోజుకు రూ.150 నుంచి రూ.200 వరకూ ఖర్చవుతుంది.



వీధి కుక్కలకు భోజనం పెడుతున్న మార్వ గిరి

అవి చూపే ప్రేమతో..



ఈ కుక్కలతో విడదీయరాని బంధం ఏర్పడింది. ఆన్‌లైన్ మార్కెటింగ్ దెబ్బకు వ్యాపారం అంతంతమాత్రంగానే సాగుతోంది. అయినా నాకు వచ్చిన దానిలో కొంత వీటి ఆకలికి తీర్చుతున్నాను. వేడుకల సమయంలో తమ ఇళ్ల వద్ద మిగిలిన ఆహారాన్ని కొందరు ఇస్తే వీటికి ఆహారంగా ఇస్తున్నాం. ఉదయం టిఫిన్ మాతో పెట్టాలి. లేకపోతే గోల గోల చేస్తాయి. అవి చూపే ప్రేమ ముందు ఇబ్బందులు ఏవీ గుర్తుండవు.

– మార్వ గిరి, చిరు వ్యాపారి, కంకిపాడు

వెంకట రమేష్‌కు అవార్డు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఏఏసీ (నాక్) సలహాదారు పి. వెంకట రమేష్‌కు 'అత్యంత ఆరాధించే విద్యా సలహాదారు' అనే బిరుదుతో సత్కరించారు. హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో ఇటీవల జరిగిన అసియా టుడే మీడియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్– 2024 వేడుకల్లో ఈ అవార్డును తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో వెంకట రమేష్ విద్యా సలహాదారుగా ఆదర్శమైన సేవలను అందించారన్నారు. ఎన్‌బీకే, ఎన్ఏఏసీ అక్రిడిటేషన్ సాధించడంలో సంస్థలకు సహాయం చేసినందుకు గానూ ఈ అవార్డు వరించిందని తెలిపారు. ఈ అవార్డు సాధించినందుకు కళాశాల చైర్మన్ బీఎస్ అప్పారావు, సెక్రటరి శ్రీ కృష్ణ అభినందనలు తెలియజేశారు.

ఎస్సీ చేపల సొసైటీలో సభ్యత్వం కల్పించాలి



కంకిపాడు: ఎస్సీ చేపల సొసైటీలో సభ్యత్వం కల్పించాలని గొడవర్రు గ్రామస్తులు డిమాండ్ చేశారు. కంకిపాడులోని అగ్రిల్యాబ్‌లో మత్స్యశాఖ అధికారి మంజూషకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ చేపల సొసైటీ ఉందన్నారు. ప్రస్తుతం 110 మంది సొసైటీలో ఉన్నారన్నారు. గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వెనుకబడి ఉన్నాయని, ఈ కుటుంబాలకు సొసైటీలో సభ్యత్వం కల్పిస్తే ఆర్థికంగా ఉన్నతి సాధించేందుకు మార్గం ఏర్పడుతుందని విన్నవించారు.

జూదరుల అరెస్టు

గుడ్లవల్లేరు: మండలంలోని వడ్లమన్నాడు మురుగు కాల్వ గట్టున కోత ముక్క ఆడుతూ నలుగురు జూదరులు శుక్రవారం పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.1,820ను స్వాధీనం చేసుకున్నట్లు గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు.

బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉయ్యూరు: బీజేపీ ఉయ్యూరు నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ దివి చిన్మయ, పెనమలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు శేషుకుమార్, ఎన్నికల అధికారి మల్లికార్జునరావు పర్యవేక్షణలో ఉ య్యూరు పట్టణ అధ్యక్షుడిగా కొండపల్లి రాజు, ఉయ్యూరు మండల అధ్యక్షురాలిగా పానుగుమాటి జ్యోత్స్నను పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మండల బీజేపీ అధ్యక్షుడిగా నీలం

గన్నవరం: బీజేపీ గన్నవరం మండల అధ్యక్షుడిగా నీలం అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కురుముద్దాలి ఫణికుమార్ నేతృత్వంలో ఎన్నిక నిర్వహించారు. పార్టీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, కార్యవర్గ సభ్యులు నాదెండ్ల మోహన్, మహిళా మోర్చా నాయకులు కానూరి శేషుమాధవి, మండల మాజీ అధ్యక్షుడు అన్నపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: పార్టీ పెనమలూరు, కంకిపాడు మండలాలు నూతన కమిటీల ఎన్నిక శుక్రవారం కంకిపాడు పట్టణంలో నిర్వహించారు. పెనమలూరు మండల అధ్యక్షుడిగా యిట్టాల శ్రీనివాస్, కంకిపాడు మండల అధ్యక్షుడిగా గుళ్లపూడి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ కృష్ణా జిల్లా కార్యదర్శి శేషు, పార్టీ నేతలు దీవి రోహిణి, విజయేంద్ర, కృష్ణమోహన్, నాగరాజేష్, శివశంకర్, శివ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలిక

కృష్ణలంక(విజయవాడతూర్పు): చదువుకోవడం ఇష్టంలేక పాఠశాలకు వెళ్లకుండా ఆర్టీసీ బస్సు ఎక్కి విజయవాడ బస్టాండ్‌కు చేరుకున్న బాలికను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కృష్ణాజిల్లా, ఆగిరిపల్లి మండలం, ఈదులగూడెం గ్రామానికి చెందిన కేరావు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుంటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన కుమార్తె(11) ఆ గ్రామం పక్కనే ఉన్న ఈదర గ్రామంలోని పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. ఈ క్రమంలో రోజులాగే బాలిక శుక్రవారం ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరింది. పాఠశాలకు వెళ్లకుండా విజయవాడ బస్సు ఎక్కి బస్టాండ్‌కు చేరుకుంది. బస్టాండ్‌లో బాలిక ఒంటరిగా ఉండడాన్ని గమనించిన పోలీసులు ప్రశ్నించగా తనను గుర్తు తెలియని ఒక వృద్ధురాలు కిడ్నాప్ చేసి తీసుకొచ్చిందని, తనకు తల్లిదండ్రులు ఎవ్వరూలేరని చెప్పింది. బాలికను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించి తల్లిదండ్రుల వివరాలు తెలుసుకుని వారికి సమాచారం అందించారు. స్టేషన్‌కు చేరుకున్న తల్లిదండ్రులు టీచర్ కొడుతుందన్న భయంతో పాఠశాలకు వెళ్లకుండా విజయవాడకు వచ్చినట్లు చెప్పారు. పోలీసులు బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

సర్వీస్ ప్రొవైడర్లకు నైపుణ్య శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ఆయా డివిజన్లలో నివాసం ఉంటున్న వివిధ రకాల సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించి వారికి నైపుణ్య సాంకేతిక శిక్షణ కల్పించేందుకు వీఎంసీ చర్యలు తీసుకుంటుందని వీఎంసీ పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి (పీవోయూసీడీ) వెంకట నారాయణ తెలిపారు. గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో శుక్రవారం వివిధ రకాల సర్వీస్ ప్రొవైడర్‌లైన ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటి మరమ్మతులు చేసేవారు పెయింటర్, బ్యూటీషియన్ (స్త్రీలైనా, పురుషులైనా) తదితర చేతివృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చేతి వృత్తిదారుల ఆర్థిక స్థితి గతులు మెరుగుపరచేందుకు, వారిలోని నైపుణ్యానికి మరింత మెరుగులు దిద్దే క్రమంలో ఈ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 556 అభ్యర్థులు రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తులు సమర్పించారని చెప్పారు. దరఖాస్తుదారులందరికీ ఈ నెల 15 నుంచి 31 వరకు ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇవ్వటమే కాకుండా ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 8790233881, 7780683789 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో 23 వ డివిజన్ కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ బాల స్వామి, విజయవాడ నగరపాలక అధికారులు ఫణికుమార్, సుజాత, జగదీశ్వరి పాల్గొన్నారు.

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో డాక్టర్ అన్వర్‌కు స్థానం



భవానీపురం(విజయవాడపశ్చిమ): హైకోర్ట్ న్యాయవాది, రీసెర్చ్ స్కాలర్ విద్యాధరపురానికి చెందిన డాక్టర్ అన్వర్ షేక్‌కు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (లండన్)లో స్థానం లభించింది. విద్య, రీసెర్చ్, సామాజిక సేవ అంశాల్లో కృషి చేసినందుకుగాను సంస్థ ఆయనకు ఈ సర్టిఫికెట్ ప్రదానం చేసింది. ఈ మేరకు డాక్టర్ అన్వర్ షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ రీసెర్చ్ స్కాలర్‌గా 2019లో అవార్డ్, అలాగే 2020లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పీహెచ్‌డీ పట్టా పొందానని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో పలు ఆర్టికల్స్ ప్రచురితమయ్యాయని తెలిపారు. కోవిడ్, ప్రకృతి విపత్తుల సమయాల్లో బాధిత కుటుంబాలకు మందులు, ఆహారం, వైద్య సాయం వంటి అనేక సేవలు అందించానని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్వర్ షేక్‌ను పలువురు న్యాయవాదులు, సామాజికవేత్తలు అభినందించారు.

మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



సమావేశంలో ఎమ్మెల్యే బోడెప్రసాద్, కమిషనర్ భవానిప్రసాద్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులపై అధికారులు, ఉద్యోగులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకి ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం మున్సిపాలిటీ అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ డ్రెయినేజీల నిర్మాణంలో కచ్చితంగా లెవల్స్ పాటించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లకు అంచనాలు వేయాలని సూచించారు. టీడీఆర్ బాండ్లు వేగంగా అమలు చేయాలని, అభివృద్ధి పనుల విషయంలో ఇంజినీరింగ్ అధికారులు రాజీపడవద్దన్నారు. ఇంటి పన్నులు ఆన్‌లైన్ చేయాలని, వీధి దీపాలు సక్రమంగా వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి వారం పనులపై సమీక్ష నిర్వహిస్తామని ఎమ్మెల్యే ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ భవానిప్రసాద్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నిక



ఎం.అశ్వినికుమారి



కె.రాజ్యలక్ష్మి

గన్నవరం రూరల్: ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.హరిశరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.అశ్వినికుమారి(దావాజీగూడెం హైస్కూల్), ప్రధాన కార్యదర్శిగా కె.రాజ్యలక్ష్మి(కేసరపల్లి ఎంపీపీఎస్), గౌరవ అధ్యక్షులుగా ఎం.వీరబాబు(కేసరపల్లి హైస్కూల్), జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా ఎస్.రవీంద్ర భవాని (గన్నవరం బాలుర హైస్కూల్)లను ఎన్నుకున్నారు. వీరిని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, ఎం.మనోహర్ అభినందించారు. ఉపాధ్యాయ సమస్యలపై సమష్టిగా పోరాటాలు చేయాలని సూచించారు.

మహిళాభ్యున్నతికి సావిత్రిబాయి పూలే కృషి



రాయ్‌నగర్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, మహిళలు

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లో శుక్రవారం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి జెడ్పీటీసీ, పలువురు మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నవరపు మాట్లాడుతూ.. ఆధునిక విద్య ద్వారానే మహిళాభ్యున్నతి సాధ్యపడుతుందని నమ్మి పూణేలో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారని చెప్పారు. తద్వారా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉపాధ్యాయురాలిగా, సంఘ సంస్కర్తగా చరిత్రలో నిలిచారని తెలిపారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని మహిళల అభ్యున్నతికి ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని కోరారు. ఉయ్యూరు పద్మ, కూనపురెడ్డి రజని, ఈదా పద్మ, మేరీ, కలపాల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు అభ్యంతరం

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుడు (10వ వార్డు) ఆవుల నాగేశ్వరరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి దేవగిరి సుజాత అధ్యక్షతన గ్రామసభ జరిగింది. పాలకవర్గ సభ్యుడు ఆవుల నాగేశ్వరరావు, విజయవాడకు చెందిన కొంతమంది రోడ్డు నిర్మించడానికి తాము అంగీకరించమన్నారు. రోడ్డుకు ఆనుకొని తమ ఇళ్లస్థలాలు ఉన్నాయని, రోడ్డు నిర్మాణంలో కొంత మా స్థలం పోతుందని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శి కోటిలింగమ్మ పల్లెపండుగ సందర్భంగా ఉపాధి నిధులు రూ.10 లక్షలతో నిర్మించే రోడ్డుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ శంకుస్థాపన చేశారని, అది జరిగి మూడు నెలలవుతుంటే ఇప్పటి వరకు ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయలేదని, పని ప్రారంభించగానే అభ్యంతరం వ్యక్తం చేయడం సరికాదన్నారు. ఏది ఏమైనా మా స్థలంలో రోడ్డు నిర్మించడానికి అంగీకరించబోమని నాగేశ్వరరావు తెలియజేశారు. గ్రామ సభలో అప్పారావుపేట గ్రామంలో అధ్వానంగా ఉన్న అంతర్గత సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మాణం చేయాలని గ్రామస్తులు అడిగారు. సమావేశంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల పోస్టర్ ఆవిష్కరణ



ముగ్గుల పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంధ్యారాణి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీన ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యార్థినులు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ మహిళా విభాగం బాధ్యులు ఎ.సంధ్యారాణి తెలిపారు. గవర్నర్‌పేట, రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ముగ్గుల పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ మహిళల్లో దాగి ఉన్న కళలను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బిర్లా ఓపెన్‌మైండ్ సౌజన్యంతో ఎం.జి.రోడ్డులోని సిద్ధార్థ మహిళా కళాశాలలో ఈ పోటీలు మూడు కేటగిరిలలో జరుగుతాయన్నారు. మొదటి కేటగిరిలో 5, 6, 7 తరగతుల విద్యార్థినులు, రెండో కేటగిరిలో 8, 9, 10 తరగతులు, మూడో కేటగిరలో ఇంటర్, డిగ్రీ విద్యార్థినులు, నాల్గో కేటగిరిలో మహిళలకు పోటీలు జరుగుతాయన్నారు. ప్రవేశం ఉచితమని, స్పాట్ రిజిస్ట్రేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు సంక్రాంతి సాంప్రదాయ పద్ధతుల్లో భోగి మంటలతో పాటు గంగిరెద్దులు, హరిదాసుల కళారూపాలతో ప్రారంభమవుతాయన్నారు. నగరంలోని విద్యార్థినులు, మహిళలు రంగవల్లుల పోటీల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



నృత్యం ప్రదర్శించిన కళాకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం పలువురు నృత్య కళాకారులు నృత్య నీరాజనాలు అర్పించారు. విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన శ్రీనాట్య వేద ఆర్ట్స్ అకాడమీకి చెందిన లలితాదేవి పర్యవేక్షణలో 25 మంది చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులకు విశేషంగా అలరించింది. అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు ఆలయ డీఈవో రత్నరాజు దేవస్థానం తరుపున ప్రశంసాపత్రాలు, అమ్మవారి ప్రసాదాలు అందచేశారు.